సాక్షి మంచిర్యాల

ఆదివారం । 5 । నవంబర్ । 2023



ఆర్వో కార్యాలయం సందర్శన

బెల్లంపల్లి: బెల్లంపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య శనివారం సందర్శించారు. కార్యాలయం వంద మీటర్ల లోపు ర్యాలీలు, వాహనాలను అనుమతించబోమని తెలిపారు. పోలీసు బందోబస్తును పర్యవేక్షించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల ఏఐసీసీ పరిశీలకులు, ఏఐసీసీ క్లస్టర్ ఇన్‌చార్జీలను నియమించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు పరిశీలకులను ప్రకటించింది. ఏఐసీసీ అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా చెన్నూర్‌కు ఐ.దేవేంద్రప్ప, బెల్లంపల్లికి శ్రీనివాస్ ఎస్టీ, ఆసిఫాబాద్‌కు జీఎన్.గణేశ్, ఆదిలాబాద్‌కు ఆర్.రాజేంద్రను నియమిస్తూ ఆ పార్టీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

గరిష్టం/కనిష్టం
33.0 /21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈశాన్యం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లెక్కింపు కేంద్రం సిద్ధంగా ఉండాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్



లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సంతోష్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణతోపాటు లెక్కింపు కేంద్రం పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. శనివారం హాజీపూర్ మండలం ముల్కల్ల ఐజా కళాశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలించారు. అన్ని వసతులు, సౌకర్యాలు సిద్ధం చేసి ఉంచాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు టేబుళ్లు, చుట్టూ ఉండే కంచెలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, లెక్కింపు చేపట్టే రౌండ్ల వారీగా ఈవీఎం, వీవీపాట్‌లను భద్రపరిచేలా చేపట్టాల్సిన ఏర్పాట్లు, గదుల పనులను పర్యవేక్షించారు. 30న ఎన్నికలు, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని, 5వరకు ఎన్నికల నియమావళి అమలులో ఉంటుందని అన్నారు. జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలు ఉండగా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అంతా సమన్వయంతో పని చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఈఈ స్వామిరాజ్, అధికారులు పాల్గొన్నారు.

'ప్యారచూట్ అభ్యర్థులను గోదావరి దాటిద్దాం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

జన్నారం: స్థానికేతర ప్యారచూట్ అభ్యర్థులను చిత్తుగా ఓడించి గోదావరి నదిని దాటిద్దామని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు వద్దామని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. శనివారం మండలంలోని రాంపూర్, పొనకల్, జన్నారం గ్రామాలకు చెందిన సుమారు 300 మంది ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పొనకల్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖానాపూర్‌లో అభివృద్ధిని, వచ్చిన నిధులు వినియోగించకుండా బీఆర్‌ఎస్ మంత్రులు అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్సీ, ఖానాపూర్ నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి ప్రకాశ్‌రాథోడ్, ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, మాజీ ఎంపీపీ శంకరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నందునాయక్, నాయకులు రాజశేఖర్, శుభాష్‌రెడ్డి, మాణిక్యం, ఇందయ్య, రమేశ్, హేమంత్, ముజ్జు, రాకేశ్ పాల్గొన్నారు.

చెన్నూర్ బీఎస్పీ అభ్యర్థిగా దాసరపు శ్రీనివాస్



బీఫారం అందజేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్

చెన్నూర్: చెన్నూర్ బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థిగా డాక్టర్ దాసరపు శ్రీనివాస్ ఖరారయ్యారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ శనివారం ఆయనకు పార్టీ బీఫామ్ అందజేశారు. శ్రీనివాస్ పీసీసీ డాక్టర్ సెల్ చైర్మన్‌గా పని చేశారు. డాక్టర్ సెల్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల బతుకులు బాగుపడాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలని తెలిపారు.

ఎన్సీపీ అభ్యర్థిగా మద్దెల శ్రీనివాస్



శ్రీనివాస్‌కు బీఫారం అందజేస్తున్న సునీల్

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అభ్యర్థిగా బెల్లంపల్లికి చెందిన మద్దెల శ్రీనివాస్‌ను ఆ పార్టీ ఎంపిక చేసింది. శనివారం హైదరాబాద్ లోని ఎన్సీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌యాదవ్ శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోటీ చేస్తున్న అభ్యర్థుల బీ ఫారాలను శ్రీనివాస్‌కు అందజేశారు. ఎన్నికల్లో విజయం సాధించడానికి కృషి చేయాలని కోరారు.

చెన్నూర్ రాజకీయం రసవత్తరం

- గడ్డం వివేక్ రాకతో కాంగ్రెస్‌లో ఊపు
- బీఆర్‌ఎస్‌లో బాల్క సుమన్ దూకుడు
- ఎన్నికల ప్రచారంలో వేగం పెంచిన నాయకులు
- పోటాపోటీగా సాగుతున్న ప్రచారం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అసెంబ్లీ ఎన్నికల్లో చెన్నూర్ రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. ఈ నియోజకవర్గంలో ఎన్నికల వేళ అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటుండడం ఆసక్తి కలిగిస్తోంది. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తలంపు రాజకీయ పార్టీల మధ్య పోటాపోటీ ప్రచారానికి దారి తీస్తోంది. ప్రధాన పార్టీల నుంచి ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ ఎంపీ వివేక్ బరిలో ఉండడంతో నువ్వా నేనా అన్న తీరులో పోరు సాగుతోంది. ఈ స్థానం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాల్క సుమన్ పోటీలో ఉండగా, కాంగ్రెస్ పార్టీ నుంచి గడ్డం వివేక్ రాకతో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటికీ అధికారికంగా చెన్నూర్ నుంచి పోటీ చేసే అభ్యర్థి పేరు ఖరారు కాలేదు. వివేక్ కాంగ్రెస్ పార్టీలో చేరికతో దాదాపు ఆయనకే బీఫాం అన్నట్లుగా పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. చెన్నూర్ నుంచి వివేక్ బరిలో ఉంటారనే విషయం ఖాయమైనట్లు తెలుస్తోంది. ఇక సీపీఐకి టికెట్ ఇస్తామని ప్రతిపాదించినప్పటికీ చర్చల దశలోనే పొత్తు ఆగిపోయింది. బీజేపీలో వివేక్ ఉన్నంత కాలం ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహం ఉండేది. ప్రస్తుతం సరైన అభ్యర్థి కోసం వెతికే క్రమంలో ఎవరినీ ప్రకటించలేదు. ఆయన పార్టీ మార్పుతో ఇక్కడ బీజేపీ ఇబ్బందిలో పడింది.

పోటాపోటీగా చేరికలు

ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల్లో చేరికల పర్వం పోటాపోటీగా సాగుతోంది. బీజేపీలోని వివేక్ అనుచర వర్గం భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరుతోంది. ఇక గతంలో కాంగ్రెస్ పార్టీతో ఉన్న వారంతా తిరిగి కాంగ్రెస్‌లోకి చేరేందుకు ప్లాన్ వేశారు. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ నుంచి అధికంగా కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా భీమారం, జైపూర్ మండలాల్లో అధికార పార్టీకి చెందిన గ్రామ సర్పంచ్‌లు మూకుమ్మడిగా రాజీనామాలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. రామక్రిష్టాపూర్, చెన్నూరు పట్టణాల్లోనూ చేరికలపై దృష్టి సారిస్తుండడంతో వలసలతో హస్తం పార్టీలో ఊపు వస్తోంది. మందమర్రి పట్టణంలో పలువురు వివేక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇదే బాటలో మరికొందరు చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే బాల్క సుమన్ నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నారు. పార్టీలో నష్టం జరగకుండా అసమ్మతి నాయకులతో చర్చిస్తూ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. బుజ్జగింపులు, హామీలు ఇస్తూ నాయకులతో చర్చలు సాగిస్తున్నారు. ఎప్పటికప్పుడు ఎదురుదాడితో వివేక్‌పై విరుచుకుపడుతున్నారు. ఈ నెల 7న మందమర్రి పట్టణంలో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభతో ఊపు తెచ్చేందుకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రచార సభను విజయవంతం చేసి, బీఆర్‌ఎస్‌ను పటిష్టం చేసేందుకు పావులు కదుపుతున్నారు. ఈ మేరకు పార్టీ కేడర్‌ను అంతా సిద్ధం చేస్తున్నారు.

వెనక్కి తగ్గిన ఓదెలు

వివేక్ రాకతో మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పార్టీని వీడుతారనే ప్రచారం జరిగినా చివరికి ఆయనతో కలిసి పని చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు పార్టీ సీనియర్ నాయకులు జానారెడ్డి సమక్షంలో నాయకులంతా చర్చలు జరిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అసంతృప్తులు ఒక్కొక్కరుగా చల్లబడుతున్నారు. టికెట్ ఆశించి భంగపడిన మాజీ మంత్రి బోడ జనార్దన్, తదితర నాయకులు పార్టీలోనే ఉన్నారు. మరోవైపు రాజారమేశ్ తన అనుచరులతో సమావేశమై కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. మరోవైపు బీఎస్పీ నుంచి డాక్టర్ దాసారపు శ్రీనివాస్, టీడీపీ నుంచి సంజయ్, బీజేపీ టికెట్ కోసం దుర్గం అశోక్ ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొంద రు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగేందుకు ప్రణాళికలు వేశారు. ఈ క్రమంలో జిల్లాలో చెన్నూరు రాజకీయాలు రోజురోజుకు రసవత్తరంగా సాగుతున్నాయి.

అభ్యర్థుల ప్రతీ ఖర్చు లెక్కించాలి



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు అశోక్‌కుమార్, పవన్, జిల్లా ఎన్నికల అధికారి సంతోష్

- ఎన్నికల వ్యయ పరిశీలకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతీ ఖర్చును లెక్కించాలని చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు అశోక్‌కుమార్, మంచిర్యాల నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు సీఎస్.పవన్ అన్నారు. శనివారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు రాహుల్(బెల్లంపల్లి), రాములు(మంచిర్యాల), సిడాం దత్తు(చెన్నూర్), అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి నోడల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వేలైన్స్, వీడియో పరిశీలన, అకౌంటింగ్, ఖర్చుల పరిశీలకులు, సహాయ సిబ్బందితో పరిశీలనపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలను వీడియో చిత్రీకరించాలని అన్నారు. అభ్యర్థుల ఖర్చుల వివరాలను లెక్కించాలని తెలిపారు. స్టేజ్, బారికేడింగ్, కార్పెట్, టేబుళ్లు, కుర్చీలు, లౌడ్‌స్పీకర్లు, మైక్రోఫోన్, పోస్టర్లు, డీజే లైటింగ్, బ్యానర్లు, కటౌట్లు, హోర్డింగులు, విద్యుత్ వినియోగం, కండువాలు, జెండాలు తదితర ప్రతీ అంశానికి ధరను నిర్ణయించినట్లు తెలిపారు.

రూ.40 లక్షలు మించకూడదు..

ఎన్నికల పోటీ చేసే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరువాలని, ప్రతీ చెల్లింపు లావాదేవీలను ఖాతా ద్వారా మాత్రమే చేయాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు తెలిపారు. రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని అన్నారు. అనంతరం కంట్రోల్ రూమ్, మీడియా సెంటర్, సోషల్ మీడియా సెల్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ కేంద్రం పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. కంట్రోల్ రూమ్, సీ-విజిల్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు.

మంచిర్యాల ఎన్నికల వ్యయ పరిశీలకుడి మార్పు

నస్పూర్: మంచిర్యాల నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకుడిగా నియమించిన అజయ్ గౌతమ్ స్థానంలో సీఎస్ పవన్‌ను నియమించారు. శనివారం పట్టణంలోని సీసీసీ సింగరేణి గెస్టుహౌస్‌లో ఆయనకు కలెక్టర్ సంతోష్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్‌నాథ్‌కేకన్ స్వాగతం పలికారు.

ఎవరు కావాలో ప్రజలే తేల్చుకోవాలి

- వేల కోట్ల ఆస్తులున్న వ్యక్తి కావాలా..?
- వేల కోట్ల నిధులు తెచ్చే అభ్యర్థి కావాలా..?
- చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుమన్, ఎంపీ వెంకటేష్

రామకృష్ణాపూర్: వేల కోట్ల ఆస్తులు కలిగిన వ్యక్తి కావాలా..? లేక వేల కోట్ల నిధులు తెచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న తాను కావాలా..? ప్రజలే తేల్చుకోవాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ అన్నారు. క్యాతనపల్లిలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదారుసార్లు పార్టీలు మారి నిలకడ, నీతి, నిజాయతీ లేని వ్యక్తి ఇప్పుడు మళ్లీ బరిలో నిలుస్తున్నారని, ఆ పార్టీలోనైనా భవిష్యత్తులో ఉంటాడా లేదా అని కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ వివేక్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. పారిశ్రామికవేత్తలుగా పేరు గడించిన వివేక్, వినోద్‌లు చెన్నూర్‌లో ఎందుకని ఒక్క పరిశ్రమ కూడా స్థాపించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించలేకపోయారని ప్రశ్నించారు. వాళ్లకు ఉద్యోగం కోసం ఎన్నికలప్పుడు ప్రజల ముందుకు వస్తున్నారు తప్ప ఈ ప్రాంత ప్రజలపై వారికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. చెన్నూర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి తన హయాంలో జరిగిందని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడే బాల్క సుమన్‌ను ప్రజలు మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. అనంతరం చెన్నూర్ నియోజకవర్గంలో తన హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన చెన్నూర్ ప్రగతి ప్రస్థానం పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

అభిమానుల ఒత్తిడితోనే ఎమ్మెల్యేగా పోటీ

- మాజీ ఎంపీ గడ్డం వివేక్
- కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక



మాట్లాడుతున్న వివేక్, పక్కన ఎమ్మెల్యే ఓదెలు

మందమర్రిరూరల్: బీఆర్‌ఎస్ పార్టీని ఓడించడం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్‌లో చేరానని, తొలుత ఎంపీగా పోటీ చేయాలని అనుకున్నా.. పార్టీ అధిష్టానం, అభిమానులు ఎమ్మెల్యేగా పోటీ చేయాలని ఒత్తిడి చేయడంతోనే చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో దిగానని మాజీ ఎంపీ గడ్డం వివేక్ ప్రకటించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన శనివారం మందమర్రికి రాగా పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరిట లక్ష కోట్ల ప్రజాధనాన్ని దోచుకుని ఎన్నికల్లో పంచి గెలవాలని కలలు కంటున్నారని, ఆ డబ్బులు తీసుకుని కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుమన్ నియంత పోకడ వల్ల అభివృద్ధి జరగలేదని విమర్శించారు. చిర్రకుంట సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య, రాంటెంకి విజయ, నాయకులు గుడ్ల రమేష్, అర్జున్ మహంత్, మంద తిరుమల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం వంశీ, దుర్గం నరేష్, శీలం చిన్నయ్య, రాంచందర్, నీలయ్య పాల్గొన్నారు.

ఎన్నికలతోనే మందమర్రి అభివృద్ధి

- మున్సిపల్ ఎన్నికలకు డిమాండ్



ప్రజా ఎజెండాలో పాల్గొన్న ఊరు మందమర్రి ప్రజలు

మందమర్రిరూరల్: చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు. త్రిసభ్య కమిటీ నిర్వహణతో అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఏజెన్సీ పేరిట వచ్చిన నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్న మందమర్రి 1993లో నోటిఫైడ్ ఏరియా, 1995లో మందమర్రి మున్సిపాలిటీగా మారింది. 1998లో మున్సిపల్ ఎన్నికలకు సిద్ధపడిన తెలుగుదేశం ప్రభుత్వం చైర్‌పర్సన్ స్థానాన్ని ఎస్సీ మహిళకు కేటాయించింది. ఇక్కడ ఏజెన్సీ చట్టం అమల్లో ఉండడంతో చైర్‌పర్సన్ స్థానం ఎస్టీలకు కేటాయించాలని అప్పటి మాజీ సర్పంచ్ మద్ది రాంచందర్ కోర్టుకు వెళ్లగా ఎన్నికల నిలిపివేతకు స్టే ఇచ్చింది. తర్వాత కొన్నేళ్లకు రాంచందర్ మరణంతో కేసు తొలగిపోయింది. అయినా ఎన్నికల నిర్వహణ ఇప్పటికీ సాధ్యం కాలేదు. శనివారం పట్టణంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఎజెండాలో పలువురు మాట్లాడారు.

హక్కులు కోల్పోతున్నాం..



పాలకుల నిర్లక్ష్యం వల్లనే మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరగడం లేదు. గతంలో కోర్టు కేసు సాకుతో ఎన్నికల నిర్వహణ నిలిపివేశారు. ప్రస్తుతం ఎలాంటి కేసు లేకున్నా నిర్వహించడం లేదు. దీంతో ఏజెన్సీ హక్కులు కోల్పోతున్నాం.

– పెద్ది రాజన్న, ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఊరుమందమర్రి

బిల్లు అవసరం లేదు



ఏజెన్సీ చట్టం ఎత్తివేతకు పార్లమెంటులో బిల్లు అవసరం. కానీ, ఎన్నికల నిర్వహణకు ఎలాంటి బిల్లు అవసరం లేదు. గతంలో చైర్‌పర్సన్ స్థానం విషయమై కోర్టుకు వెళ్లడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. ఏజెన్సీ చట్టం ఎత్తివేస్తేనే ఎన్నికలు జరుపవచ్చని చెప్పడం సరికాదు.

– మహమ్మద్ ఇబ్రహీం, ఊరుమందమర్రి

అభివృద్ధికి ఆటంకం



మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరుగకపోవడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. ఏజెన్సీ ఏరియా కాబట్టి మంజూరయ్యే నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. ప్రజాప్రతినిధులు లేక ఎవరిని అడగాలో తెలియని పరిస్థితి నెలకొంది. జీవనోపాధికి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నాం.

– పాలమాకుల భీంసేన్, ఊరుమందమర్రి

గ్రామ పంచాయతీగా మార్చండి..



మున్సిపాలిటీ ఎన్నికలకు ఏజెన్సీ చట్టం అడ్డు వస్తుందని దాట వేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఊరుమందమర్రి, నార్లాపూర్, ఊరు రామకృష్ణాపూర్‌లను కలిపి ప్రభుత్వం ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసి అభివృద్ధికి సహకరించాలి. ప్రత్యేక గ్రామ పంచాయతీ చేసినట్లయితే ఈజీఎస్ పథకం ద్వారా ఉపాధి లభించే అవకాశం ఉంది.

– మహమ్మద్ ముజాహిద్, ఊరు మందమర్రి గ్రామ పంచాయతీ సాధన సమితి సభ్యుడు

పూడికతో నిండిన మురికి కాల్వలు



ఊరు మందమర్రిలో కనీస సౌకర్యాలైన రోడ్లు, డ్రెయినేజీలు సరిగా లేవు. అక్కడక్కడ ఉన్న డ్రెయినేజీలు పూడికతో నిండి కంపు కొడుతున్నాయి. పూడిక నిండిన కాలువల్లో దోమలు పెరుగుతున్నాయి. అనారోగ్యం పాలు కావాల్సి వస్తుంది. మందమర్రి మున్సిపాలిటీ ఎన్నికలు జరిపిస్తే ప్రజాప్రతినిధి ఉంటాడు కాబట్టి అన్ని సౌకర్యాలు కల్పించుకోవచ్చు.

– పెద్ది లక్ష్మి, ఊరుమందమర్రి

సమస్యలు వినేదెవరు..



ఊరుమందమర్రిలో పుట్టుక నుంచి ఉంటున్నాను. మా నాన్నకు సంబంధించిన నాలుగెకరాల భూమి కేకే ఓపెన్ కాస్ట్ గని కింద పోయింది. సింగరేణి వారు ఉద్యోగం ఇస్తానని ఇంతవరకు ఇవ్వలేదు. జీవనోపాధికి ఇబ్బందిగా మారింది. నా సమస్య ఎవరికి చెప్పాలో.. వినేదెవరో తెలియని పరిస్థితి. నాలాంటి వారు ఊరు మందమర్రిలో చాలామంది ఉన్నారు. ఎన్నికలు నిర్వహిస్తే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుంది.

– భూనేని కిశోర్

అట్టహాసంగా పద్మశాలీల అలయ్.. బలయ్



కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

బెల్లంపల్లి: పట్టణంలోని బాబుక్యాంపు బస్తీ పద్మశాలి భవన్‌లో శనివారం పద్మశాలీల అలయ్ బలయ్ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. సుమారు 1500 మంది హాజరయ్యారు. కళాకారులు పాటలు పాడి ఉత్తేజపర్చారు. ఉన్నత విద్య, ఉద్యోగాలు చేస్తున్న పద్మశాలి యువతీ, యువకులను సన్మానించారు. ఎమ్మెల్యే, బెల్లంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు గడ్డం వినోద్, అమురాజుల శ్రీదేవి వేర్వేరుగా హాజరై పద్మశాలీలను కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, రాష్ట్ర ఆప్కో మాజీ చైర్మన్ గడ్డం జగన్నాథం, ఏఎంసీ మాజీ చైర్మన్ సిలివేరి నర్సింగం, కౌన్సిలర్లు ఎలిగేటి సుజాత, నీలి కృష్ణ, పద్మశాలి సంఘ నాయకులు భావనరుషి, మధు, తడక రవి, డీకొండ రాజలింగు, కంకటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కేసీఆర్ పాలన అంతం'

పాతమంచిర్యాల: కేసీఆర్ పాలనను అంతమొందించాలని తెలంగాణ జన సమితి(టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రంలో తెలంగాణ జన సమితి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీని గద్దె దించడానికి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పని చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నెరవేర్చాల్సిన షరతులను ముందుంచినట్లు వివరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బి.బాబన్న, రామచంద్రారెడ్డి, గోనేల శ్రీనివాస్, బచ్చలి ప్రవీణ్‌కుమార్, సిరాజ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న మహేందర్



నామినేషన్ వేస్తున్న గవ్వల శ్రీకాంత్

రెండో రోజు రెండే నామినేషన్లు

మంచిర్యాలఅగ్రికల్చర్/బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నామినేషన్ల స్వీకరణ రెండో రోజు శనివారం రెండే నామినేషన్లు దాఖలయ్యాయి. మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడానికి గాను గవ్వల శ్రీకాంత్ నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి రాములుకు అందజేశారు. మంచిర్యాల నియోజకవర్గంలో మొత్తంగా ఇప్పటివరకు రెండే నామినేషన్లు దాఖలు అయ్యాయి. బెల్లంపల్లి అసెంబ్లీ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి బెల్లంపల్లికి చెందిన అంబాల మహేందర్ నామినేషన్ దాఖలు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి రాహుల్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. కాగా, ఈ నెల 10వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు ఉండడంతో అభ్యర్థులు మంచి ముహూర్తం రోజు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నెల 9న పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

అలరించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సైన్స్ కేంద్రంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు అలరించాయి. ముత్యంపల్లి విద్యార్థుల బృందం, ఉపాధ్యాయురాలు శాంకరి నేతృత్వంలో ప్రచార యుద్ధం అనే డ్రామా మొదటి బహుమతి, ఆదర్శ పాఠశాల మంచిర్యాల ఉపాధ్యాయురాలు వనిత నేతృత్వంలో విద్యార్థుల బృందం పాల్గొన్న ఇంపార్టెన్స్ ఆఫ్ ఈటింగ్ మిల్లెట్స్ అనే డ్రామా ద్వితీయ బహుమతి సాధించారు. ముత్యంపల్లి విద్యార్థుల బృందం 8న రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో పాల్గొంటుందని డీఈవో యాదయ్య తెలిపారు. డీఎస్‌వో మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదృశ్యమైన మహిళ మృతి


లలిత(ఫైల్)

జైపూర్: మండలంలోని ఇందారం గ్రామంలో అదృశ్యమైన పిన్న లలిత మృతిచెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె 15రోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. రెండ్రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోగా కుటుంబ సభ్యులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంధువుల ఇళ్లలో ఆరా తీసి సోషల్ మీడియాలో పోస్టులు చేయగా కరీంనగర్ బస్టాండ్‌లో దిగినట్లుగా సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని ఆచూకీ కోసం గాలించారు. శనివారం కరీంనగర్ ఎల్‌ఎండీ డ్యాంలో స్థానికులు లలిత(68) మృతదేహాన్ని గుర్తించారు. ఆమెకు భర్త సమ్మయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు.

ఎక్సైజ్ దాడుల్లో గుడుంబా ధ్వంసం

ఆసిఫాబాద్: రెబ్బెన మండలంలోని రాళ్లపేట, సింగిల్‌గూడలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. రాళ్లపేటలో విక్రయిస్తున్న 5 లీటర్ల గుడుంబా పట్టుకోవడంతో పాటు గ్రామ పరిసరాల్లో తయారు చేస్తున్న 800 లీటర్లు, సింగిల్‌గూడలో 700 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. దాడుల్లో 5 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ తెలిపారు. దాడుల్లో ఎస్సై విజయలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ధర్మా ప్రకాశ్, కానిస్టేబుళ్లు మహేశ్, మమత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థి ప్రతిభ

బెల్లంపల్లి: ప్రతిష్టాత్మక అగాఖాన్ అకాడమీలో ప్రవేశం కోసం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్‌ఎక్సలెన్సీ(సీఓఈ) విద్యాలయం విద్యార్థి నిచ్చకోల రుషికేష్ ప్రతిభ చాటాడు. శనివారం గురుకులంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఓఈ ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. రుషికేష్‌ను గురుకులాల జాయింట్ సెక్రెటరీ కంభంపాటి శారద, ఆర్సీఓ కొప్పుల స్వరూపారాణి ఫోన్ చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్, హారిక, స్రవంతి, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై సోలార్ యూనిట్లు

- స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు
- మహిళా సంఘాల సభ్యుల ఆసక్తి
- వాయిదాల్లో రుణం చెల్లించే వెసులుబాటు


ఇంటిపై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్న మహిళా సంఘం సభ్యురాలు

పాతమంచిర్యాల: స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం సోలార్ యూనిట్లు అందిస్తోంది. గ్రామీణాభివృద్ధిశాఖ సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సభ్యులకు వీటిని పంపిణీ చేస్తోంది. ఇందుకోసం స్త్రీనిధి ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తోంది. జిల్లాలో 2 కిలోవాట్, 3 కిలోవాట్ సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్ల ఏర్పాటుకు సభ్యులు ఆసక్తి చూపుతున్నారు. ఇంటి దాబాలపై వీటిని ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఖర్చు తగ్గించుకోవడం, ఆదా చేసుకోవడంపై దృష్టిపెట్టారు. జిల్లాలో భీమిని మండలం మల్లిడి గ్రామంలో ఇప్పటికే 3 సోలార్ యూనిట్లు ఏర్పాటు కాగా, మంచిర్యాలలోని సున్నంబట్టివాడలో ఒక యూనిట్ ఏర్పాటు చేశారు. భీమిని మండలంలో మరో 5 యూనిట్లు, జిల్లా కేంద్రంలో మరో మూడు యూనిట్లు ఏర్పాటు కానున్నాయి. 3 కిలోవాట్ సోలార్ యూనిట్ ధర రూ.2.64 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.43 వేల వరకు సబ్సిడీ భరిస్తుంది. లబ్ధిదారులు రూ.1.69 లక్షలు రుణంగా ఐదేళ్ల సులభ వాయిదాలు నెలకు రూ.3500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సోలార్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వినియోగించుకుని మిగిలినది విద్యుత్ సంస్థలకు అమ్ముకునే అవకాశం ఉంది. ఇందుకోసం ప్లాంట్ ఏర్పాటు సమయంలో నెట్ మీటర్, గ్రిడ్‌మీటర్ అనే రెండు మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. 3 కిలోవాట్ల సోలార్‌ప్లాంట్ రోజుకు 10 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తే 30 రోజులకు 300 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇంటి అవసరాల నిమిత్తం నెలకు 100 యూనిట్లు వినియోగించుకుంటే మిగిలిన 200 యూనిట్లు గ్రిడ్‌కు అమ్ముకోవచ్చు. విద్యుత్ సంస్థ నిర్ణయించిన యూనిట్ రేట్లను లబ్ధిదారులకు చెల్లిస్తారు. రెడ్‌కో సంస్థ ప్లాంట్‌ను 20 ఏళ్ల గ్యారంటీతో ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి మరమ్మతు వచ్చిన పూర్తి బాధ్యతను సోలార్ యూనిట్ తయారీదారులదే బాధ్యత. దీంతో మహిళా సంఘాల సభ్యులు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుపై మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాంట్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణం మంజూరు చేస్తోంది. విద్యుత్ ఆదాతోపాటు విద్యుత్ ఉత్పత్తిపై ఆదాయం వస్తుందనే విషయాలు వివరిస్తున్నాం. – వెంకటరమణ, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్, డీఆర్‌డీఏ, మంచిర్యాల

ఓటు వినియోగంపై వినూత్న ప్రచారం


అందె సంతోశ్



ద్విచక్ర వాహనంపై ప్రచారం బోర్డు

మంచిర్యాలటౌన్: ఓటు హక్కు వినియోగంపై మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్డుకు చెందిన అందె సంతోశ్ బాబు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. "నా ఓటును అమ్ముకుంటాను.. నాకు సిగ్గులేదు, ఉద్యోగాలు, ఉపాధి అవసరం లేదు, మద్యానికి బిర్యాని, డబ్బులకు అమ్ముడుపోతాను, నాకు సిగ్గులేదు'' అని ఓ బోర్డును తయారు చేసి తన ద్విచక్ర వాహనం వెనుకాల అమర్చాడు. వాహనంపైనే పట్టణంలో పర్యటిస్తున్నాడు. ప్రజలు పాజిటివ్‌గా చెబితే అర్థం చేసుకోవడం లేదని, ఇలా నెగెటివ్‌గా ప్రచారం చేస్తున్నట్లు సంతోశ్‌బాబు చెప్పాడు. జాతీయ దారిద్ర్య రేఖ దిగువ ప్రజల హక్కుల పోరాట సమితిని ఇటీవల స్థాపించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపాడు.

ఎంపీ వెంకటేష్ నేత వాహనం తనిఖీ


ఇందారం చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై ఉపేందర్‌రావు, పక్కన ఎంపీ వెంకటేష్

జైపూర్: మండలంలోని ఇందారం గోదావరిబ్రిడ్జి సమీపంలో పెద్దపల్లి–మంచిర్యాల జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు వద్ద శనివారం పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత వాహనాన్ని పోలీసులు తనిఖీ చేశారు. ఎంపీ గోదావరిఖని నుంచి మంచిర్యాలకు వెళ్తుండగా ఎన్నికల నియమావళిలో భాగంగా జైపూర్ ఎస్సై ఉపేందర్‌రావు తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిరంతరం నిఘా ఏర్పాటు చేసి వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. జైపూర్ అదనపు ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు

- జిల్లాలో 18వేల ఎకరాల్లో మామిడి సాగు
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు


తిరుపతి, హెచ్‌వో


మామిడి చెట్లు

చెన్నూర్‌రూరల్: జిల్లాలో మా మిడి సాగుపై ఎందరో రైతులు ఆధారపడి జీవిస్తున్నారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 18వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని హెచ్‌వో తిరుపతి వివరించారు. ఈ నెల ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇప్పటి నుంచి నాలుగు నెలల కాలం మామిడి పంటకు కీలకమని పేర్కొన్నారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. నవంబర్ నెల నుంచి నీరుపెట్టడం పూర్తిగా ఆపేయాలి. లేదంటే చెట్టు శాఖీయంగా బాగా పెరగడంతోపాటు పూత రావడం ఆలస్యం అవుతుంది. పూత రావడం అనేది రాత్రి పూట చలని వాతావరణం, పగటి పూట ఉన్న ఎక్కువ ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత కనీసం 13డిగ్రీల సెంటీగ్రేడ్ చేరుకునేలా కనీసం 15 రోజులపాటు కొనసాగితే పూత వస్తుంది, వాతావరణ పరిస్థితులు కొమ్మల్లోని హార్మోన్ల నిష్పత్తి కొమ్మకు తగినంత వయసు అనేది పూత రావడానికి ప్రధాన పాత్ర పోషిస్తుంది.

పూత బాగా రావాలంటే...

పూత బాగా రావాలంటే కొత్తగా వచ్చే చిగుర్లపై 5 గ్రాములు జింక్ సల్ఫేట్, 2 గ్రాములు బోరాక్స్, 10 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తోటలను చీడపీడల నుంచి కాపాడుకోవాలి

ఈ నెల నుంచి మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు లేత కొమ్మలను ఆశించి నష్ట పరుస్తాయి. తేనె మంచు పురుగు తల్లి, పిల్ల పురుగు లేత ఆకులు, పూల కొమ్మలపై గుంపులు, గుంపులుగా చేరి రసం పీల్చుతాయి. దీంతో కాడలు, కొమ్మలు మాడిపోయి, ఎండిపోయి, పూత, పిందె ఏర్పడదు. ఒకవేళ ఏర్పడినా బలహీన పడతాయి. ఈ పురుగు తేనే లాంటి పదార్థాలను విసర్జించడం వల్ల శిలీంధ్రాలు ఆకర్షింపబడి కాడలు, ఆకులపై మసి లాంటి పొర ఏర్పడి కిరణజన్య సంయోగ క్రియ జరగదు. దీంతో చెట్టుకు కావాల్సిన పోషకాలు అందవు. దీని నివారణ కోసం ఈ మాసంలో కార్బాలిల్ 3గ్రాములు, ఆర్థిన్ 1గ్రాము, నువాన్ ఒక మిల్లీలీటరు, 5 మిల్లీలీటర్ల వేపనూనె, కార్బండిజమ్ ఒక గ్రాము లేదా మ్యాంకోజెబ్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి చెట్టు, కాండం కొమ్మల నుంచి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి. తామర పురుగు లేత కొమ్మలను ఆశించి రసం పీల్చడం ద్వారా కొమ్మలు రాతి రంగుకు మారి మాడిపోతాయి. దీని నివారణకు రీజెంట్ 2మిల్లీలీటర్లు, ఎసిఫేట్ 1.5 గ్రాములను లేత కొమ్మలు, ఆకులపై పిచికారీ చేయాలి.

తెగులు నివారించాలి

ఈ మాసంలో బూడిద తెగులు పూల కొమ్మలను ఆశించి నష్ట పరుస్తుంది. తెల్లని బూడిద లాంటి పొడి ఆకులు, పూత కాడలపై కనిపిస్తుంది. చలి ఎక్కువైన పరిస్థితుల్లో తెగులు తీవ్రమవుతుంది. తెగులు సోకిన భాగాలు నల్లగా మారిపోతాయి. ఆకులు, పూలకాడలు సక్రమంగా పెరగవు. ఈ తెగులు వల్ల పంటకు 30 నుంచి 60శాతం వరకు పంట నష్టం కలుగుతుంది. దీని నివారణకు మూడు గ్రాములు నీటిలో కరిగే గంధకం(సల్ఫర్)ను పువ్వు వచ్చే కాడలు, కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలి. హెక్సాకొనజోల్ మందును 2 మిల్లీలీటర్లు తీసుకొని లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నవంబర్ నెలలో మామిడి తోటకు బెట్ట పరిస్థితులు కల్పిస్తూ సస్యరక్షణ చర్యలతో తోటల్లో అధిక పూత పొందవచ్చు.

కాంగ్రెస్‌లో చేరనున్న సర్పంచులు

జైపూర్: మండలంలోని అధికార పార్టీ బీఆర్‌ఎస్ చెందిన సర్పంచులు కాంగ్రెస్‌లో చేరికకు రంగం సిద్ధం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. మండలంలోని 20 గ్రామాల్లో 10 నుంచి 12 మంది సర్పంచులు పార్టీని వీడనున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులను పట్టించుకోకపోవడం, ఒంటెత్తు పోకడలతో ఖాతరు చేయకపోవడంతో పార్టీని వీడుతున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మాజీ ఎంపీ గడ్డం వివేక్ బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మండల ముఖ్యనేతలు కొందరు అధికార బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరికకు ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. గత ఎమ్మెల్యే ఎన్నికల్లో సుమన్ తొలిసారి నియోజకవర్గ పర్యటనలో చోటుచేసుకున్న పెట్రోల్ మంటల దాడిలో గాయపడ్డ ప్రజాప్రతినిధులు, నాయకులు తీవ్ర నిరాశలో ఉన్నారని, వారు కూడా కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

కాంగ్రెస్ పార్టీలోకి ప్రజాప్రతినిధులు?

భీమారం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని సమాచారం. మాజీ ఎంపీ గడ్డం వివేక్ బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో రాజకీయాలు వేడెక్కాయి. మండలంలో 11మంది సర్పంచులు, ఇద్దరు ఎంపీటీసీలు ఉండగా బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం కల్పించడం లేదని కొందరు అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ నాయకుడు వివేక్‌తో ఉండాలని ఒక నిర్ణయానికి వచ్చి ఒకట్రెండు రోజుల్లో పార్టీని వీడనున్నట్లు తెలిసింది.

'ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రచారానికి సిద్ధం'

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎన్నికల్లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆరిజిన్ డెయిరీ నిర్వాహకురాలు బోడపాటి శేజల్ పేర్కొన్నారు. శనివారం ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఎమ్మెల్యే చిన్నయ్య తనకు అండగా ఉన్న అధికారులను బదిలీ కాకుండా చూసుకున్నారని తెలిపారు. ఆర్డీఓ కొంతకాలం నుంచి జిల్లాలో పని చేసినప్పటికీ బెల్లంపల్లికి రప్పించుకున్నారని తెలిపారు. ఆయనపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో బదిలీ వేటు పడిందని తెలిపారు. మహిళలపై వేధింపులు, అవినీతి, అక్రమాలకు పాల్పడిన చిన్నయ్యను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని ఆమె ఓటర్లకు పిలుపునిచ్చారు.

'చందాల రికవరీకి సంబంధం లేదు'

శ్రీరాంపూర్: తమ యూనియన్ పేరుతో కార్మికుల బ్యాంక్ ఖాతాల నుంచి రికవరీ అవుతున్న డబ్బులకు, సీఐటీయూకు ఎలాంటి సంబంధం లేదని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచీ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, కార్యదర్శి గోదారి భాగ్యరాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి ఏరియాలో యూనియన్ బ్యాంక్‌లో అకౌంట్ ఉన్న కార్మికుల్లో కొందరికి తమ యూనియన్ చందా పేరుతో రూ.500లు రికవరీ అవుతున్నాయన్నారు. దీనికి తమ యూనియన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ రికవరీ అయిన డబ్బులకు సంబంధించి యూనియన్ బ్యాంక్‌లో ఖాతా ఉన్న సదరు కార్మికుల నుంచి తాము ఎలాంటి రికవరీ కోరలేదన్నారు. కావున కార్మికులు గమనించాల్సిందిగా తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ నేతలు ఆర్కే 5గని మేనేజర్ అబ్దుల్ ఖాదీర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గని ఫిట్ సెక్రెటరీ గునిగంటి నర్సింహారావు మాట్లాడుతూ.. గనిలో మ్యాన్ రైడింగ్ సమయాన్ని కార్మికులకు అనుకూలంగా ఏర్పాటు చేయాలన్నారు. గనిలో ఉపయోగిస్తున్న ఎస్‌డీఎల్స్ యంత్రాలు కాలం చెల్లాయని తెలిపారు. దీంతో తరచూ మొరాయిస్తున్నాయని, కార్మికులు శ్రమపడాల్సి వస్తుందన్నారు. ఇంకా ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు గట్టు బాలయ్య, పెసర కొండపృధ్వి పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో (క్రాస్‌రోడ్డు–కాగజ్‌నగర్) ప్రధాన రహదారిపై శనివారం ఓ ట్రక్కు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇటీవల కొనుగోలు చేసిన కారు డ్యామేజ్ అవడంతో యజమాని పోలీసులకు సమాచారం అందించారు. కాగజ్‌నగర్–క్రాస్ రోడ్డు ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొంతమంది భారీ వాహనాలను రోడ్డుకు ఇరువైపులా నిలిపివేయగా ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతోంది. ప్రధాన రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు ఆర్టీవో అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.80 వేల నగదు పట్టివేత


పట్టుబడిన నగదుతో పోలీసులు

వాంకిడి: ఎన్నికల నేపథ్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ.80,160 నగదు పట్టుబడినట్లు ఎస్సై డీ.సాగర్ తెలిపారు. మండలంలోని ఇందాని ఎక్స్‌రోడ్డు వద్ద శనివా రం తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్‌కు చెందిన తక్కల హరీశ్ ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తరలిస్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న ఆశయ్య

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామ శివారులోని ప్రభుత్వ అసైన్డ్ భూమిలో గుడిసెలు వేసుకున్న మహిళలపై దాడి చేసి, గుడిసెలను కాల్చి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య డిమాండ్ చేశారు. కాలిన గుడిసెలను శనివారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు, కబ్జాదారులకు మద్దతుగా నిలవడం శోచనీయమని పేర్కొన్నారు. అధికారులు, పోలీసులు కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు దాసరి రాజేశ్వరి, పాయిరాల రాములు, ఎండి అవేజ్, మణి, రుక్సానా, ప్రసన్న, మధు, సాజిద్, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే ప్రగతి


పురస్కార గ్రహీతలతో ఆర్‌ఎం, అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులంతా సమష్టి కృషితో ముందుకు సాగినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలోమన్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రీజినల్ లెవెల్ ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అత్యుత్తమ సేవలు అందించిన 28 మంది ఉద్యోగులకు పురస్కారాలతోపాటు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. అలాగే రీజియన్ పరిధిలో ఆదిలాబాద్ డిపో అగ్రస్థానంలో నిలవగా, డీఎం కల్పన ప్రోత్సాహకాన్ని అందుకున్నారు. ఇందులో డిప్యూటీ ఆర్‌ఎంలు ప్రణీత్, ప్రవీణ్, ఆసిఫాబాద్ డిపో మేనేజర్ శ్రీధర్ తదితరులున్నారు.

నియోజకవర్గానికో నంబర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అసెంబ్లీ ని యోజకవర్గాలను సాధారణంగా పేర్లతో పి లుస్తాం. కానీ సాంకేతికపరంగానే కాకుండా ఎన్నికల సంఘం విధుల్లో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి ఒక్కో నంబర్ కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాలైన సిర్పూర్ 001, చెన్నూర్ 002, బెల్లంపల్లి 003, మంచిర్యాల 004, కుమురంభీం ఆసిఫాబాద్ 005, ఆదిలాబాద్ 006, బోథ్ 007, నిర్మల్ 008, ముథోల్ 009, ఖానాపూర్ 010 నంబర్‌తో ఉన్నాయి.